


వెదురు సాగుపై రైతులకు అవగాహన

ప్రజాశక్తి-గొల్లప్రోలు

రైతులు వెదురు పంటను వేసుకుంటే తక్కువ పెట్టుబడితో ఎక్కువ లాభాలు పొందవచ్చునని శాస్త్రవేత్త డాక్టర్ చల్లా వెంకట నరసింహారావు తెలిపారు. గురువారం మండలంలోని చేబ్రోలులో ఉద్యాన శాఖ ఆధ్వర్యంలో రైతులకు వెదురు పంటపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా నరసింహారావు మాట్లాడుతూ రైతులు వెదురు పంటను ప్రధాన పంటగా, చుట్టూ రక్షణ పంటగా వేసుకుంటే తక్కువ పెట్టుబడితో మూడేళ్ల నుంచి 40 ఏళ్ల వరకూ ఏటా కోత కోసుకుని మార్కెటింగ్ చేయవచ్చునని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఉద్యాన శాఖ అధికారి వై.రాజశేఖర్, వ్యవసాయ శాఖ అధికారి రాజా, పంతంజలి కంపెనీ ప్రతినిధులు వెంకటేశ్వర్లు, కామేష్, శ్రీనివాస్ రైతులు పాల్గొన్నారు.

ఆశలన్నీ సీలేరు పైనే..!

ఈ ఏడాది రబీ సాగులో రైతులకు సాగునీటి కష్టాలు తప్పేటట్లు లేవు. గోదావరిలో సాగునీటి లభ్యత ఆందోళనకరంగా ఉంది. ఎన్నడూ లేని విధంగా డిసెంబర్ నెలలోనే గోదావరిలో ఇసుక మేటలు బయట పడ్డాయి. ధవళేశ్వరం ఆనకట్టకు ఎగువ భాగంలో భారీగా ఇసుక మేటలు పేరు కుపోయాయి. ఆనకట్టకు కేవలం 500 మీటర్ల దూరంలోనే నదిలో పలుచోట్ల రెండు మూడు అడుగులు లోతు మాత్రమే నీరు ఉంది. కొవ్వూరు రోడ్డు కం రైలు వంతెన వద్ద పూర్తిగా నీరు తగ్గిపోవడంతో గోదావరిలో ఇసుక మేటలు దర్శనమిస్తున్నాయి. ఇటువైపు నుంచి అవతలి వడ్డు వరకు నడిచి వెళ్లిపోయే పరిస్థితులు ఏర్పడ్డాయి.


కాటన్ బ్యారేజీ ఎగువన గోదావరి నదిలో కనిపిస్తున్న ఇసుక మేటలు

- రబీకి తప్పని సాగునీటి కష్టాలు
- 93.26 టిఎంసిల సాగునీరు అవసరం
- అందుబాటులో 73.36 టిఎంసిలే
- 19.90 టిఎంసిల కొరత
- నీటి పొదుపు చర్యలపై అధికారుల దృష్టి

ప్రజాశక్తి - కొవ్వూరు

ఉమ్మడి ఉభయగోదావరి జిల్లాల్లో గోదావరి డెల్టా ఆయకట్టులో 8,96,507 లక్షల ఎకరాలకు సాగునీరు అందించాల్సి ఉందని అధికారులు లెక్కలు వేశారు. ఈ సీజన్‌లో సాగునీటి అవసరాల నిమిత్తం 86.04 టిఎంసిలు, పరిశ్రమలు, తాగునీటి అవసరాల నిమిత్తం 7.22 టిఎంసిల నీరు అవసరమని అధికారులు లెక్కలు వేశారు. ఈ రబీ సీజన్‌లో మొత్తం 93.26 టిఎంసిల నీరు అవసరమని జల వనరుల శాఖ అధికారులు తేల్చారు.

19.90 టిఎంసిల కొరత

ఏడాది రవి సీజన్లో గోదావరిలో సహజ జలాల రూపంలో 9.45 టిఎంసిల నీరు అందుబాటులో ఉంటుందని అంచనా వేశారు. పోలవరం ప్రాజెక్టు ద్వారా 20 టిఎంసిల నీరు, సీలేరు జలాశయం ద్వారా 43.91 టిఎంసిల నీరు అందుబాటులో ఉంటుందని లెక్కలు వేశారు. మొత్తం 73.36 టిఎంసిల నీరు అందుబాటులో ఉంటుందని లెక్కలు వేశారు. ఈ లెక్కన 19.90 టిఎంసిల నీరు రబీ సీజన్‌లో కొరత ఉంటుందని అంచనా వేశారు.

సీలేరు జలాలే దిక్కు

సీలేరు నుంచి రోజుకి 4,200 క్యూసెక్కుల చొప్పున సాగు నీరు అందుతుందని జలవనుల శాఖ అధికారులు చెబుతున్నారు.


సీలేరు రిజర్వాయర్

రబీ సీజన్ గోదావరి నీటి లభ్యత వివరాలు

గోదావరి డెల్టా ఆయకట్టు	: 8,96,507 ఎకరాలు
రబీలో అవసరమైన సాగునీరు	: 86.04 టిఎంసిలు
తాగునీరు, పరిశ్రమలు అవసరమైన నీరు	: 7.22 టిఎంసిలు
మొత్తం రబీకి అవసరమైన నీరు	: 93.26 టిఎంసిలు
గోదారిలో సహజ జలాల ద్వారా	: 9.45 టిఎంసిలు
పోలవరం ప్రాజెక్టు నుంచి	: 20 టిఎంసిలు
సీలేరు ద్వారా లభ్యమయ్యే సాగునీరు	: 43.91 టిఎంసిలు
ఇంకా అవసరమైన నీరు	:19.90 టిఎంసిలు

43.91 టిఎంసిల నీటిని గోదావరి డెల్టాకు విడుదల చేసేందుకు అంగీకరించినట్లు అధికారులు చెబుతున్నారు. ఈ సీజన్‌లో సీలేరు జలాశయానికి సుమారు 70 టిఎంసిలు నీరు అందుబాటులో ఉండొచ్చని అంచనా వేశారు. రబీ సీజన్‌లో కొరత వచ్చే జలాలను సీలేరు ద్వారా సర్దుబాటు చేయాలని అధికారులు యోచిస్తున్నారు. రెండు నెలల పాటు సీలేరు కాంప్లెక్స్ పరిధిలో ఉండే పొల్లూరు జల విద్యుత్ కేంద్రానికి నీటి సరఫరా చేసే డొంకరాయి పవర్ కెనాల్‌కు నీటి సరఫరా రెండు నెలలపాటు నిలిపివేస్తున్నట్లు ఎపి జెన్‌కో ఛీఫ్ ఇంజినీర్ కెవి.రాజారావు ప్రకటించారు. దీంతో రానున్న రెండు నెలలు సీలేరు నుంచి అనుకున్న స్థాయిలో నీరు వచ్చే అవకాశం కన్పించడం లేదు. సీజన్ ప్రారంభంలోనే గోదావరిలో ప్రమాద ఘంటికలు మోగుతున్నాయి.

నీటి పొదుపు చర్యలే శరణ్యం

ఈ ఏడాది రబీ సీజన్‌లో రైతుల పంటలు గొట్టెక్కాలంటే నీటి పొదుపు చర్యలే శరణ్యమని అధికారులు భావిస్తున్నారు. పలుచోట్ల మురుగు కాలువలకు అడ్డుకట్టలు, ఆయిల్ ఇంజన్ల సాయంతో శివారు ప్రాంతాలకు సాగునీరు సరఫరా చేయాల్సి ఉంది. కోనసీమ జిల్లా పరిధిలోని సెంట్రల్ డెల్టాకు సాగునీటి కష్టాలు తీర్చేందుకు రూ.2.5 కోట్ల తో అధికారులు ప్రతిపాదన పంపారు. ఏలూరు జిల్లా పరిధిలో పశ్చిమ డెల్టా కాలువ నీటి పొదుపు జల్లు నిమిత్తం రూ.56,199 ప్రతిపాదనలు పంపారు. పశ్చిమగోదావరి జిల్లాల పరిధిలో పశ్చిమ డెల్టా కాలువకు రూ.2 కోట్లతో ప్రతిపాదన పంపించారు. వీటికి తోడు నీటి పొదుపు చర్యలు క్షేత్రస్థాయిలో పర్యవేక్షణ నిమిత్తం ఉమ్మడి ఉభయగోదావరి జిల్లాలోని మూడు డెల్టాలకు 610 తాత్కాలిక లస్కర్లను నియమించారు.


గోదావరి తూర్పు డెల్టా కాలువకు విడుదలవుతున్న నీరు

నీటి పొదుపు చర్యలు పాటించాలి

రబీ సీజన్‌లో గోదావరి డెల్టా ఆయకట్టు రైతులు నీటి పొదుపు చర్యలు పాటించాలి. సెంట్రల్ డెల్టాకు నీటి పొదుపు చర్యలు నిమిత్తం రూ.2.5 కోట్ల అంచనాతో ప్రతిపాదన పంపించాం. వీటితో ఆయిల్ ఇంజన్లు ఏర్పాటు, మురుగు కాలువలకు అడ్డుకట్టలు తదితర పనులు చేపడతాం. రబీ పంట గట్టెక్కాలంటే 19.90 టిఎంసిల నీరు అదనంగా అవసరం ఉంది. సీలేరులో ఎగువ ప్రాజెక్టులతో కలిపి 70 టిఎంసిలు వరకు నీరు అందుబాటులో ఉంటుందని అంచనా. దీనిలో 43.91 టిఎంసిలు సీలేరు నుంచి ఇచ్చేందుకు అంగీకరించారు. నీటి కొరతకు ఆస్కారం లేకుండా సీలేరు ద్వారా అవసరమైన నీటిని తీసుకునేందుకు చర్యలు తీసుకుంటాం.

-కె.గోపీనాథ్, ఎస్ఇ, గోదావరి హెడ్ వర్క్స్, ధవళేశ్వరం

ప్రభుత్వ కార్యాలయాలు ప్రారంభం

ప్రజాశక్తి-కాకినాడ రూరల్, పెద్దాపురం

పంచాయతీరాజ్ గ్రామీణ అభివృద్ధి శాఖకు సంబంధించి రాష్ట్ర వ్యాప్తంగా 77 డివిజనల్ అభివృద్ధి కార్యాలయాలను గురువారం చిత్తూరు జిల్లా నుంచి ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్, పంచాయతీరాజ్ డైరెక్టర్ ఎం.కృష్ణతేజ, స్థానిక అధికారులు, ప్రజాప్రతినిధులతో కలిసి వర్చువల్‌గా ప్రారంభించారు. ఈ కార్యక్రమానికి కాకినాడ రూరల్ రమణయ్యపేటలోని ఎంపిడిఒ కార్యాలయం పక్కన ఏర్పాటు చేసిన కాకినాడ డివిజనల్ అభివృద్ధి కార్యాలయం నుంచి కలెక్టర్ షాన్‌మోహన్, ఎంఎల్‌సిలు కర్రి పద్మశ్రీ, పేరాబత్తుల రాజశేఖరం, ఎంఎల్ఎ పంతం నానాజీ, రాష్ట్ర పౌరసరఫరాల సంస్థ డైరెక్టర్ కె.ఈశ్వరి, ఎంపిపి అనంతలక్ష్మి వర్చువల్‌గా హాజరయ్యారు. అనంతరం కాకినాడ డివిజనల్ అభివృద్ధి కార్యాలయాన్ని వారు ప్రారంభించారు. కలెక్టర్ షాన్‌మోహన్ మాట్లాడుతూ ఈ కార్యాలయం అందుబాటులోకి రావడం ద్వారా ప్రజా అవసరాలను తీర్చేందుకు ప్రతి గ్రామపంచాయతీని అనుసంధానం చేస్తూ, క్షేత్రస్థాయిలో రాష్ట్ర ప్రభుత్వ సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాల పర్యవేక్షణ చేసేందుకు అవకాశం ఉంటుందన్నారు. ప్రభుత్వ ఆదేశాలు వేగంగా క్షేత్రస్థాయికి చేరేలా ఈ కార్యాలయాలు ఎంతగానో దోహద పడతాయని తెలిపారు. డిఎల్‌పిఒ, డ్వామా ఎపిడి ఇలా అన్ని విభాగాలను ఒకే చోట పనిచేసేలా కార్యాలయాన్ని మంచి సదుపాయాలతో ఏర్పాటు చేయడం శుభపరిణామం అన్నారు. మినీ కలెక్టరేట్‌లా అధికారులు అంతా ఒక టీములా పని చేయాలని ఆయన సూచించారు. ఈ కార్యక్రమంలో జెడ్‌పి సిఇఒ లక్ష్మణరావు, డిపిఒ వి.రవికుమార్, కాకినాడ డివిజన్ అభివృద్ధి అధికారి పి.వాసుదేవ పాల్గొన్నారు. **పెద్దాపురం** ఎంఎల్ఎ జ్యోతుల నెహ్రూ, డిసిసిబి చైర్మన్ తుమ్మల బాబు కార్యాలయంలో వివిధ విభాగాలను ప్రారంభించారు. వారు మాట్లాడుతూ ఈ కార్యాలయాల ద్వారా గ్రామీణాభివృద్ధిలో కీలకమైన ముందడుగన్నారు. ప్రభుత్వ పాలన గ్రామీణ ప్రజలకు మరింత చేరువవుతుందన్నారు. డిడిఒ ఎం.శ్యామల, మున్సిపల్ మాజీ చైర్మన్ రాజా సూరిబాబు రాజు, డిఎల్‌పిఒ బాలామణి, ఎంపిడిఒ కెవి.సూర్య నారాయణ, ఎపిఒ సుధీర్, మొయిళ్ల కృష్ణమూర్తి, అరవింద కుమార్, విశ్వేశ్వరరావు, నూనె రామారావు, రేలంగి వెంకటరావు, జల్దాని సుబ్రహ్మణ్యం, తూతికి రాజు, జివి.శేఖర్ రెడ్డి, ఎఒ ఎం.సత్యనారాయణమూర్తి పాల్గొన్నారు.


కాకినాడలో కార్యాలయాన్ని ప్రారంభిస్తున్న ఎంఎల్ఎ నానాజీ

మావోయిస్టుల కదలికలు పూర్తిగా లేవు

ప్రజాశక్తి-కోటనందూరు

జిల్లాలో మావోయిస్టుల కదలికలు పూర్తిగా తగ్గిపోయని ఎస్‌పి బిందు మాధవ్ అన్నారు. కోటనందూరు పోలీస్ స్టేషన్‌ను గురువారం ఆయన తనిఖీ చేశారు. రికార్డులను పరిశీలించారు. పోలీస్ స్టేషన్ పనితీరుపై సంతృప్తి వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా ఆయన విలేకరులతో మాట్లాడుతూ ఇంటిలిజెన్స్ వ్యవస్థ సమర్థవంతంగా పనిచేయడం వల్ల మావోయిస్టులు జిల్లాకు వచ్చే పరిస్థితి లేదని అన్నారు. గంజాయి అక్రమ రవాణాపై ఉక్కుపాదం మోపుతున్నామని తెలిపారు. గంజాయి రవాణా చేసే స్మగ్లర్లను అరెస్ట్ చేసి జైలుకు పంపిస్తున్నామని అన్నారు. అనంతరం తునిలోని సర్కిల్ కార్యాలయాన్ని, తొండంగి మండలంలోని పోలీస్ స్టేషన్‌లో తనిఖీలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో పెద్దాపురం డిఎస్‌పి శ్రీహరిరాజు, సిఐ చెన్నకేశవరావు, ఎస్ఐ టి.రామకృష్ణ, విజయ్‌బాబు, అప్పారావు పాల్గొన్నారు.


సమావేశంలో మాట్లాడుతున్న ఎస్‌పి


ధాన్యాన్ని పరిశీలిస్తున్న రాజబాబు

ధాన్యం కొనుగోలు చేయాలి

ప్రజాశక్తి-కాజులూరు

ధాన్యాన్ని ప్రభుత్వమే మద్దతు ధరకు కొనుగోలు చేయాలని ఎపి కౌలు రైతుల సంఘం నాయకుడు వల్లు రాజబాబు డిమాండ్ చేశారు. గురువారం ఆయన కాజులూరు, దుగ్గుదుర్రు, కుయ్యేరులో ధాన్యం రాశులను పరిశీలించారు. ఆయన మాట్లాడుతూ కాజులూరు మండలంలో సగం ధాన్యం ఇంకా కళ్లాల్లోనే ఉందని తెలిపారు. భూ యజమానులు ధాన్యం అమ్ముకునేందుకు కాగితాలు ఇవ్వని కారణంగా ఆరిన ధాన్యం సైతం 75 కేజీలు రూ.1,770 రావాల్సి ఉండగా రూ.1,550కే అమ్ముకోవడం చాలా దురదృష్టకరం అన్నారు. దళారులు లేకుండా ధాన్యం కొనుగోలు చేస్తామని చెప్పి రైతు సేవా కేంద్రాల్లో ధాన్యం కాటా కానీ, ధాన్యం తూసే జట్టు కానీ లేకపోవడంతో మళ్లీ దళారులను ఆశ్రయించాల్సి వస్తోందన్నారు. జిల్లాలో 80 శాతం భూమిని కౌలు రైతులు సాగు చేస్తుండగా, సాగు చేయని భూ యజమానులకు రెండుసార్లు అన్నదాత సుఖీభవ డబ్బులు వేశారని, పుస్తెలు తాకట్టుపెట్టి వ్యవసాయం చేస్తున్న కౌలు రైతులకు ఒక్క రూపాయి కూడా ప్రభుత్వం వేయలేదని తెలిపారు. ఇవన్నీ ఏమీ లేకుండా రైతన్న నీకోసం కార్యక్రమం ఏమాత్రం ఉపయోగం లేదని ఆయన విమర్శించారు.

సముద్రంలోకి విష వ్యర్థాలపై నిరసన

ప్రజాశక్తి-కాకినాడ రూరల్

వాకలపూడి, సూర్యారావుపేట మధ్యలో సముద్రంలోకి అత్యంత ప్రమాదకరమైన విష ద్రవాలను లారీ ట్యాంకర్ల ద్వారా విడుదల చేస్తున్నారని మత్స్యకారులు గురువారం ఆందోళన చేపట్టారు. మత్స్యకారుల ఆందోళనకు సిఐటియు రూరల్ మండల కార్యదర్శి టి.రాజా, చింతపల్లి అజయ్ కుమార్ మద్దతు తెలిపారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ మత్స్యకారులు కొంతకాలంగా వేటకి వెళుతున్నా సముద్రం లోపలికి 34 కిలోమీటర్ల వెళ్తే గానీ వేటపడట్లేదని ఆందోళన చెందారన్నారు. ఈ కాలంలో అనేక చేపలు, తాబేళ్లు, జీవులు చనిపోవడానికి ముఖ్య కారణం ఈ విష ద్రవాలేనన్నారు. మూసివేసిన పరిశ్రమలో లారీ ట్యాంకర్ల ద్వారా విష ద్రవాలను వ్యర్థాలను తీసుకుని వచ్చి సముద్రంలో కలపడం పర్యావరణాన్ని పూర్తిగా నాశనం చేయడమే అన్నారు. ఇదొక పెద్ద మాఫియా అని, తక్షణం ఈ మాఫియాపై కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. రూరల్‌లోని అన్ని పరిశ్రమలనూ పరిశీలించి విడుదల చేస్తున్న ద్రవాలను, వ్యర్థాలను పొల్యూషన్ కంట్రోల్ బోర్డ్ పూర్తిస్థాయి విచారణ జరిపి రిపోర్టు జిల్లా అధికారులకు ఇవ్వాలని డిమాండ్ చేశారు. ఇప్పటికే సముద్ర తీర ప్రాంతంలో దివీస్, అరబిందో వంటి ఫార్మా కంపెనీలు విడుదల చేసే వ్యర్థాల వల్ల మత్స్యకారులకు వేట అందుబాటులో ఉండటం లేదని మత్స్యకారుల ఆందోళన చేస్తే డిప్యూటీ సిఎం పవన్ కళ్యాణ్ వచ్చి మూడు నెలల్లో సమస్య పరిష్కరిస్తామని హామీ ఇచ్చి నేటికీ పరిష్కారం చేయలేదన్నారు. విష ద్రవాలను సముద్రంలో కలిపే లారీలను సీజ్ చేయడంతో పాటు, పరిశ్రమ యాజమాని దీని సంబంధించిన అందరి పైన ఎఫ్ఐఆర్ నమోదు చేసి పూర్తి స్థాయిలో విచారణ జరిపించాలని డిమాండ్ చేశారు.


సముద్రంలో కలువుతున్న విష ద్రవాలను పరిశీలిస్తున్న అధికారులు

మెగా పేరెంట్స్ మీట్‌కు కలెక్టర్‌కు ఆహ్వానం

ప్రజాశక్తి - కాకినాడ

రాష్ట్ర వ్యాప్తంగా శుక్రవారం జరగనున్న మెగా పేరెంట్స్ మీట్‌కు కాకినాడ కలెక్టర్ షాన్‌మోహన్ సగిలిని ఇంటర్మీడియట్ డివిఇఒ శారద, పిఆర్ జూనియర్ కళాశాల ప్రిన్సిపల్ జ్యోతుల రాంబాబు గురువారం ఆహ్వానించారు. ఇటీవల క్రీడల్లో రాష్ట్ర స్థాయి పతకాలు సాధించిన పిఆర్ ప్రభుత్వ జూనియర్ కళాశాల విద్యార్థులతో కలిసి వారు కలెక్టర్‌ను ఆహ్వానించారు. కలెక్టర్ చిత్రపటంతో కూడిన ఆహ్వాన పత్రికను కలెక్టర్ షాన్‌మోహన్‌కు అందించారు. ఇటీవల జరిగిన రాష్ట్ర స్థాయి మహిళా హాకీ జట్టులో కళాశాల విద్యార్థినులు ప్రాతినిథ్యం వహించారు. జట్టును రాష్ట్ర స్థాయిలో మొదటి స్థానంలో ఉంచడంలో ప్రతిభ కనబర్చారు. బాలుర హాకీ జట్టులో 11 మంది విద్యారులు ఉమ్మడి తూర్పు గోదావరి జిల్లా జట్టుకు ప్రాతినిథ్యం వహించారు. జట్టును రాష్ట్ర స్థాయిలో ద్వితీయ స్థానంలో నిలిపారు. జిమ్నాస్టిక్స్‌లో కె.శివగణేష్ ఆరు బంగారు పతకాలు, ఒక వెండి పతకం సాధించాడని వారు తెలిపారు. వెయిట్ లిఫ్టింగ్‌లో నలుగురు విద్యార్థులు రాష్ట్రస్థాయిలో బంగారు పతకాలు సాధించి జాతీయ స్థాయికి ఎంపికయ్యారన్నారు. విద్యార్థులను ఈ సందర్భంగా కలెక్టర్ అభినందించారు. ఈ కార్యక్రమంలో కళాశాల పీడీ రత్నశామ్యూల్, లైబ్రేరియన్ డికెవి.వర్మ, హిస్టరీ లెక్చరర్ ప్రేమ్ కుమారి, సంస్కృత లెక్చరర్ శశికళ పాల్గొన్నారు.



కలెక్టర్‌ను ఆహ్వానిస్తున్న విద్యార్థులు, ఉపాధ్యాయులు

పాఠశాలల్లో ఆర్‌జెడి ఆకస్మిక తనిఖీలు

ప్రజాశక్తి - సామర్లకోట

మండలంలోని పలు పాఠశాలల్లో ఆర్‌జెడి జి.నాగమణి గురువారం ఆకస్మికంగా సందర్శించి తనిఖీలు చేపట్టారు. ఎస్.భీమవరం పాఠశాలలో విద్యార్థుల అభ్యాసం, బోధనను పరిశీలించారు. తెలుగు, ఇంగ్లీష్ పాఠాలను విద్యార్థులే చదివి వినిపించగా, వారు చక్కగా చదవడం పట్ల నాగమణి సంతృప్తి వ్యక్తం చేశారు. ఉపాధ్యాయుల కృషిని ఆమె అభినందించారు. అనంతరం సామర్లకోట ప్రభుత్వ బాలుర ఉన్నత పాఠశాలను సందర్శించారు. పదవ తరగతి విద్యార్థులతో మాట్లాడారు. ఆర్‌జెడి రాబోయే పబ్లిక్ పరీక్షలకు ఎలా సిద్ధం కావాలి, ఏ అంశాలపై ప్రత్యేక దృష్టి పెట్టాలన్న విషయాలను వారికి వివరించారు. ఈ కార్యక్రమంలో ఎంఇఒ పి.పుల్లయ్య, హెచ్‌ఎంలు అప్పారావు, మనోజ్, ఉపాధ్యాయ సిబ్బంది పాల్గొన్నారు.

6న కరప సర్వసభ్య సమావేశం

ప్రజాశక్తి -కరప

కరప మండల పరిషత్ సర్వసభ్య సమావేశం ఈ నెల 6న నిర్వహిస్తున్నట్టు ఎంపిడిఒ జె.శ్రీనివాస్ తెలిపారు. ఉదయం 11 గంటలకు చంద్రన్న సమావేశం భవనంలో ఎంపిపి పెంకే శ్రీలక్ష్మి అధ్యక్షతన నిర్వహిస్తామని తెలిపారు. ఈ సమావేశంలో ఎంపిటిసి సభ్యులు కో ఆప్టేడ్ సభ్యులు సర్పంచులు, మండల స్థాయి అధికారులు హాజరు కావాలన్నారు. అజెండా అంచనా బడ్జెట్ 2026-27, 2025 - 26 సవరణ బడ్జెట్‌పై సమీక్ష ఉంటుందని తెలిపారు.

ఘనంగా దత్తాత్రేయ జయంతి

ప్రజాశక్తి-గొల్లప్రోలు

మండలంలోని వన్నెపూడిలో గురువారం దత్తాత్రేయ స్వామి జయంతి వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఈ వేడుకల్లో పిఠాపురం మాజీ ఎంఎల్ఎ ఎస్‌విఎస్‌ఎన్.వర్మ సతీమణి లక్ష్మీదేవి దర్శించుకుని అన్నదానం నిమిత్తం రూ.10 వేలు, దేవస్థానికి రూ.5 వేలు విరాళం అందజేశారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ కంద సుబ్రహ్మణ్యం, కంద వెంకటరమణ, రాసంశెట్టి లోవేశ్వరుడు, కంద రామకృష్ణ, మొయిళ్ల బుజ్జి, బెల్లంకొండ అప్పారావు పాల్గొన్నారు.


క్విజ్‌లో ఆర్‌బి.కొత్తూరు విద్యార్థినుల సత్తా

ప్రజాశక్తి- పెద్దాపురం

కాకినాడలో గురువారం నిర్వహించిన రిలయన్స్ ధీరుభాయ్ అంబానీ క్విజ్ పోటీలో ఆర్‌బి.కొత్తూరు జెడ్‌పి హైస్కూల్‌కు చెందిన 10వ తరగతి విద్యార్థిని గెద్దాడ శ్రీలక్ష్మి, 9వ తరగతి విద్యార్థిని సుంకర ద్రాక్షావల్లి ద్వితీయ స్థానం సాధించి బహుమతులు గెలుచుకున్నారని హెచ్‌ఎం సత్యవాణి తెలిపారు. శ్రీలక్ష్మి, ద్రాక్షావల్లిలను, వీరికి కోచింగ్ ఇచ్చిన సాంఘిక శాస్త్ర ఉపాధ్యాయుడు కంచిపాటి శ్రీరామకృష్ణను అభినందించారు.



ప్రతిభ కనబరిచిన విద్యార్థులు



మెడికవర్‌లో బ్రెయిన్ ట్యూమర్‌కు చికిత్స

ప్రజాశక్తి-కాకినాడ

మెడికవర్ హాస్పిటల్స్ క్యాన్సర్ చికిత్సలో మరో ముఖ్యమైన విజయాన్ని అందుకుంది. క్లిష్ట స్థితిలో ఉన్న ఒక బ్రెయిన్ ట్యూమర్ రోగికి అత్యాధునిక రేడియోథెరపీ సాంకేతికతను ఉపయోగించి విజయవంతంగా చికిత్స చేసి ప్రాణాపాయం నుంచి రక్షించినట్లు హాస్పిటల్ వైద్యులు తెలిపారు. ప్రముఖ అంకాలజిస్ట్ డాక్టర్ పృథ్వీరాజ్ మాసపు విలేకరుల సమావేశంలో వివరాలు వెల్లడించారు. కొన్ని రోజుల క్రితం ఇద్దరు మహిళా రోగులు తీవ్రమైన తలనొప్పి, కంటి చూపు సమస్యతో బాధ పడుతూ మెడికవర్ హాస్పిటల్స్‌కి వచ్చారన్నారు. న్యూరాలజీ, న్యూరోసర్జరీ, రేడియేషన్ ఆంకాలజీ విభాగాల వైద్యులను కలిసి రోగి పరిస్థితిని సమగ్రంగా అంచనా వేసినట్టు తెలిపారు. ఇది అత్యధిక రిస్క్‌తో కలిగి ఉన్న సమస్య కావడంతో శస్త్రచికిత్సకు అనుకూలం కాని స్థితిలో ఉన్న ట్యూమర్‌ని లక్ష్యంగా చేసుకుని అత్యాధునిక కోన్ భీమ్ రేడియోథెరపీ టెక్నాలజీ ద్వారా చికిత్సను ప్రారంభించినట్టు తెలిపారు. తక్కువ సమయంలో అధిక ఖచ్చితత్వంతో పని చేసే ఈ కోన్ భీమ్ రేడియో థెరపీ పద్ధతి ట్యూమర్‌పై మాత్రమే ప్రభావం చూపి చుట్టూ ఉన్న మెదడు కణజాలానికి ఎలాంటి నష్టం జరగకుండా రోగి ఆరోగ్యం క్రమంగా మెరుగుపడేలా చేసిందన్నారు. చికిత్స అనంతరం రోగి లక్షణాలు తగ్గి, ఆరోగ్య స్థితి స్థిరపడినట్లు ఆయన తెలిపారు. సెంటర్ హెడ్ శుభాకర రావు మాట్లాడుతూ బ్రెయిన్ ట్యూమర్ వంటి క్లిష్ట రోగాల చికిత్సలో తమకు ఆధునిక రేడియేషన్ టెక్నాలజీలు, అనుభవజ్ఞులైన వైద్య బృందం ఉన్నట్టు తెలిపారు. మెడికవర్ హాస్పిటల్స్‌లో రేడియేషన్ ఆంకాలజీ విభాగం అత్యాధునిక లినాక్ సిస్టమ్స్, పెట్ సీటీ, ఖచ్చితమైన ఇమేజింగ్ సాంకేతికతలు, హిస్టోపాథాలజీ, మల్టీ డిసిప్లినరీ టీమ్ మద్దతుతో అంతర్జాతీయ ప్రమాణాల చికిత్స అందిస్తోందన్నారు. ఈ కార్యక్రమంలో మెడికల్ సూపరింటెండెంట్ డాక్టర్ జాసన్ ఇసాక్, క్యాన్సర్‌ను జయించిన రోగులు పాల్గొన్నారు.


సమావేశంలో మాట్లాడుతున్న మెడికవర్ వైద్య బృందం

5న ఆయుర్వేద ఉచిత వైద్య శిబిరం


ప్రజాశక్తి -కరప

కరపలో ఈ నెల 5న గురజనాపల్లి ప్రభుత్వ ఆయుర్వేద వైద్యశాలలో ఉచిత వైద్య శిబిరం నిర్వహిస్తున్నట్లు వైద్యాధికారి డాక్టర్ దివ్య తెలిపారు. పల్లపు వీధి గంటల గుడి వద్ద మంగళవారం ఉదయం 10 నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకూ ఈ వైద్య శిబిరంలో బిపి, సుగర్ పరీక్షలు ఉచితంగా నిర్వహిస్తామని తెలిపారు. ఈ సందర్భంగా ప్రజలందరూ తమ ఆరోగ్య పరిస్థితులను పరిశీలించుకోవడానికి ఈ అవకాశాన్ని వినియోగించుకోవాలని కోరారు.

మహిళా న్యాయవాదికి సత్కారం

ప్రజాశక్తి-ఏలేశ్వరం

ఇటీవల ఏలేశ్వరం నగర పంచాయతీ స్టాండింగ్ కౌన్సిల్ న్యాయవాదిగా నియమితులైన ప్రముఖ న్యాయవాది అవసరాల దేవిని ప్రత్తిపాడు బార్ అసోసియేషన్ సభ్యులు గురువారం ఘనంగా సత్కరించారు. ఈ సందర్భంగా బార్ అసోసియేషన్ అధ్యక్షుడు రాజాల చిట్టిబాబు మాట్లాడుతూ దేవి మహిళా హక్కుల పట్ల అనేక అవగాహన సదస్సులో పాల్గొనడమే కాక సేవా కార్యక్రమాల్లో ముందుంటారని ప్రశంసించారు. మాజీ అధ్యక్ష కార్యదర్శులు బుగతా శివ, బొంగులూరి మధుబాబు, జొన్నాడ రాజేష్, శివకుమార్, ఆర్.వెంకట్రావు, ఆడారి సుగుణ ఉన్నారు.



న్యాయవాది దేవిని సత్కరిస్తున్న న్యాయవాదులు



జూడో పోటీల్లో ప్రతిభ కనబరిచిన విద్యార్థులు

జూడో పోటీల్లో విద్యార్థుల ప్రతిభ

ప్రజాశక్తి - జగ్గంపేట

ఎపి స్కూల్ గేమ్ ఫెడరేషన్ అధ్వర్యంలో నిర్వహించిన జూడో అండర్ 14, 19 పోటీల్లో జగ్గంపేట విద్యార్థులు ప్రతిభ చాటారు. సత్యసాయి జిల్లాలో ఈ అండర్ జూడో పోటీలు నిర్వహించారు. అండర్ 14లో 6వ తరగతి విద్యార్థిని సిహెచ్.జోష్నిక లౌక్య 23 కేజీల విభాగం నుండి, 9వ తరగతి శ్రీచైతన్య స్కూల్ విద్యార్థి జె.అభి బెంజిమెన్‌రాజ్ 70 కేజీల విభాగం నుంచి థర్డ్ ప్లేస్ సాధించి రజత పతకం గెలుచుకున్నారు. అండర్ 19లో స్థానిక ప్రభుత్వ జూనియర్ కాలేజ్ ఇంటర్ సెకండియర్ సిఇసి విద్యార్థిని ప్రసన్న రెండో స్థానంలో సిల్వర్ మెడల్ గెలుచుకుంది. వారిని జూడో కోచ్ టివివి.రమణ, సాయి, శ్రీచైతన్య ప్రిన్సిపల్ జి.శ్రీనివాసరావు, జూనియర్ కాలేజ్ ప్రిన్సిపల్ వి.శ్రీనివాస్‌రావు అభినందించారు.

నేడు ఎంఎల్ఎ నెహ్రూ ప్రజా దర్బార్

ప్రజాశక్తి-గండేపల్లి

నేడు గండేపల్లి మండల పరిషత్ కార్యాలయంలో నిర్వహించే ప్రజాదర్బార్‌లో జగ్గంపేట ఎంఎల్ఎ జ్యోతుల నెహ్రూ పాల్గొంటారని ఎంపిడిఒ సత్యారెడ్డి తెలిపారు. ఈ కార్యక్రమంలో మండలంలోని అన్ని గ్రామాల ప్రజలూ తమ అర్జీలను ఆయన దృష్టికి తీసుకువెళ్తే వెంటనే సమస్య పరిష్కరించే దిశగా చర్యలు తీసుకుంటామని తెలిపారు. దీన్ని మండలంలో అన్ని గ్రామాల ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని ఎంపిడిఒ తెలిపారు.

మాజీ సిఎం రోశయ్యకు ఘన నివాళి

ప్రజాశక్తి - జగ్గంపేట

మాజీ ముఖ్యమంత్రి కొణిజేటి రోశయ్య 4వ వర్ధంతి సందర్భంగా స్థానిక ఆర్యవైశ్య కల్యాణ మండపంలో గురువారం ఆయన ఘనంగా నివాళులర్పించారు. ఆర్యవైశ్య కార్పొరేషన్ డైరెక్టర్ కొత్త వెంకటేశ్వరరావు, ఎంపిపి అత్తులూరి నాగబాబులు రోశయ్య చిత్రపటానికి పూలమాలవేసి నివాళులు అర్పించారు. ఈ కార్యక్రమంలో వాసవి క్లబ్ గవర్నర్ మానేపల్లి బంగార్రాజు, బొండా నూకబాబు, కొత్త శ్రీరామకృష్ణ, చిత్రపు బాబు, బొండా వీర సత్య, వి.నాగసత్య, బొండాడ జగన్, పాబోలు స్వామి, కంచర్ల బాబు పాల్గొన్నారు.

నేరాలు ఘోరాలు

అదృశ్యమైన బాలిక మృతి

ప్రజాశక్తి - సీతానగరం

మండలంలోని పురుషోత్తపట్నం గ్రామానికి చెందిన మల్లి సాత్విక (10) సోమవారం సాయంత్రం అదృశ్యం అయింది. ఆ రోజు నుంచి ఆమె ఆచూకీ కోసం కుటుంబ సభ్యులు వెతుకుతున్నారు. ఎంతకూ బాలిక ఆచూకీ తెలియకపోవడంతో కుటుంబ సభ్యులు పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఈ మేరకు కేసు నమోదు చేసి పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు. ఈ నేపథ్యంలోనే గ్రామంలో ఉన్న రావిచెట్టు రేవులో ఆ బాలిక మృతదేహం ఉన్నట్లు గురువారం స్థానికులు గుర్తించారు. పోలీసులు సంఘటనా ప్రాంతానికి చేరుకుని బాలిక మృతదేహాన్ని బయటకు తీశారు. పోస్టుమార్టం నిమిత్తం మృతదేహాన్ని రాజమహేంద్రవరం ప్రభుత్వాసుపత్రికి తరలించారు. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

విద్యుత్ షాక్‌తో వ్యక్తి మృతి

ప్రజాశక్తి - నల్లజర్ల

పుల్లలపాడుకు చెందిన ఆరేపల్లి సోమరాజు విద్యుత్ షాక్‌తో అక్కడికక్కడే మృతి చెందిన సంఘటన గురువారం చోటుచేసుకుంది. ఎస్ఐ దుర్గాప్రసాద్ తెలిపిన వివరాల ప్రకారం.. మండలంలోని పుల్లలపాడు గ్రామానికి చెందిన సోమరాజు పామాయిల్ గెలలు కోసేందుకు ప్రకాశరావుపాలెం గ్రామ రైతు గద్దె సత్యనారాయణకు కూలికి వెళ్లాడు. గెలలు కోస్తూ ఉండగా విద్యుత్తు వైర్లకు ఐరన్ పైపునకు ఉన్న కత్తి తగలడంతో అతను అక్కడికక్కడే మృతి చెందాడు. మతునికి భార్య, ఇద్దరు కుమారులు ఉన్నారు. ఈ మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.

ఆంజనేయ స్వామి ఆలయంలో చోరీ

ప్రజాశక్తి - ఆత్రేయపురం

ఆంజనేయస్వామి ఆలయంలో బంగారం వస్తువులు, వెండి ఆభరణాల చోరీపై గురువారం పోలీసులు కేసు నమోదు చేశారు. మండలంలోని కట్టుంగ గ్రామంలో ఆంజనేయస్వామి ఆలయంలో ఈనెల 2వ తేదీ అర్ధరాత్రి గుర్తు తెలియని వ్యక్తులు ఆలయం తలుపులు పగలగొట్టి స్వామి వారి వెండి ఆభరణాలు, బంగారు వస్తువులు దొంగిలించారు. దీనిపై ఆలయ నిర్వహకులు ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేశామని ఎస్ఐ రాము తెలిపారు.



ప్రమాదంలో ధ్వంసమైన వాహనం

రోడ్డు ప్రమాదంలో భార్యాభర్తల మృతి

ప్రజాశక్తి - రాజానగరం

ప్రేమ వివాహం చేసుకున్న ఏడాదిన్నరకే రోడ్డు ప్రమాదంలో అశువులు బాశారు. రాజానగరం జాతీయ రహదారిపై గురువారం జరిగిన రోడ్డు ప్రమాదంలో భార్యభర్తలు మృతి చెందగా, వారికి జన్మించిన మూడు నెలల చిన్నారి అనాథగా మారింది.

మండలంలో నందరాడకు చెందిన జుత్తుక లిలాప్రసాద్(21), బొమ్మూరు బర్మా కాలనీ చెందిన సురేష్ సోమియా(20) ఏడాదిన్నర క్రితం ప్రేమ వివాహం చేసుకున్నారు. వీళ్లకు మూడు నెలల ఆడపిల్ల పుట్టింది. గురువారం మధ్యాహ్నం మోటారు సైకిల్‌పై రాజానగరం బ్యాంకు నుంచి ఇంటికి వెళుతుండగా జాతీయ రహదారి మధ్యలో నరేంద్రపురం సెంటర్లో కుడివైపు ఆగి ఉన్నారు. రాజమహేంద్రవరం నుంచి విశాఖపట్నం వైపు వెలుతున్న సిమెంట్ లోడ్ లారీ ఎడమవైపు ద్విచక్రవాహనన్ని తప్పించే ప్రయత్నంలో రోడ్డుకు కుడివైపు ఆగివున్న ఈ దంపతులను ఢీకొట్టింది. దీంతో వారు అక్కడికక్కడే మృతి చెందారు. ఎడమవైపు స్కూటీపై వెళ్తున్న గాదరాడకు చెందిన బొడ్డు వెంకటలక్ష్మి, సొమ్మంగి వీరలక్ష్మి గాయాలపాలయ్యారు. వీరిని 108లో ఆసుపత్రికి తరలించారు. మతదేహాలను పోస్టుమార్టం కోసం రాజమహేంద్రవరం ప్రభుత్వ ఆసుపత్రికి తరలించి పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.



బాలుని అప్పగిస్తున్న పోలీసులు

తప్పిపోయిన బాలుని అప్పగింత

ప్రజాశక్తి - సామర్లకోట

సామర్లకోట గోలివారి వీధికి చెందిన బాలుడు ఏనాపు జగదీష్ గురువారం అమ్మమ్మ శేషరత్నంతో కలిసి స్టేషన్ సెంటర్ రింగ్ సెంటర్‌లోని సాయిబాబా ఆలయానికి వెళ్లాడు. జగదీశ్ అక్కడి నుంచి కనిపించకుండా పోవడంతో అమ్మమ్మ, తల్లి శ్రీదేవి పోలీస్ స్టేషన్లో ఫిర్యాదు చేశారు. ఎస్ఐ, సిబ్బంది స్పందించి చుట్టుపక్కల ప్రాంతాల్లో గాలింపు చేపట్టారు. అనంతరం భీమేశ్వరాలయం వద్ద బాలుడు జగదీష్‌ను గుర్తించి కుటుంబ సభ్యులకు అప్పగించారు. ఫిర్యాదు చేసిన వెంటనే స్పందించి బాలుని సురక్షితంగా గుర్తించిన పోలీసు సిబ్బందిని ఎస్‌పి జి.బిందు మాధవ్, డిఎస్‌పి శ్రీహరి రాజు అభినందించారు.

పేకాట శిబిరంపై పోలీసుల దాడి

ప్రజాశక్తి - జగ్గంపేట

మండలంలోని గుర్రంపాలెంలో గురువారం పేకాట శిబిరంపై దాడి చేసి నలుగురిని అరెస్టు చేసినట్లు సిఐ వైఆర్‌కె.శ్రీనివాస్ తెలిపారు. ఎస్ఐ రఘునాథరావు, సిబ్బంది పేకాడుతున్న వారిని అదులోనికి తీసుకుని వారి వద్ద నుంచి రూ.10,050 నగదు స్వాధీనం చేసుకున్నట్లు సిఐ తెలిపారు.

డ్రంక్ అండ్ డ్రైవ్‌పై జైలు, జరిమానా

ప్రజాశక్తి- తాళ్లరేవు

డ్రంక్ అండ్ డ్రైవ్ కేసుల్లో ఆరుగురికి రూ.60 వేల జరిమానా, రెండు రోజుల జైలు శిక్ష విధించినట్టు ఎస్ఐ సత్యనారాయణ తెలిపారు. మద్యం సేవించి వాహనం నడిపితే చర్యలు తప్పవని ఆయన హెచ్చరించారు.

యానాం వార్తలు

ఉచిత దుస్తులకు బదులు నగదు

ప్రజాశక్తి - యానాం

పుదుచ్చేరి ప్రభుత్వం ఆది ద్రావిడ వెల్ఫేర్, షెడ్యూల్ ట్రైబ్స్ వెల్ఫేర్ డిపార్ట్మెంట్ ద్వారా సంక్రాతి పండుగకు ఇచ్చే ఉచిత దుస్తులకు బదులు నగదు జమ చేయనున్నట్లు ఆ శాఖ అధికారి కె.రవికుమార్ గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ సందర్భంగా 18 ఏళ్లు నిండిన వారు తమ ఆధార్ కార్డు, రేషన్ కార్డ్, బ్యాంక్ ఎకౌంట్, వయసు నిర్ధారణ సర్టిఫికెట్లు కాపీలను ఈ నెల 8 లోగా కార్యాలయంలో సమర్పించాలని కోరారు. యానాంలో నివసించే షెడ్యూల్ క్యాస్ట్‌కు చెందిన కుటుంబ సభ్యుల వివరాలు కార్యాలయంలో నమోదు చేసుకోవాలన్నారు.

యానాం సిఐగా షణ్ముగ సుందరం

ప్రజాశక్తి - యానాం

యానాం సర్కిల్ ఇన్స్పెక్టర్‌గా పి.షణ్ముగ సుందరంను నియమిస్తూ పుదుచ్చేరి భద్రతా విభాగం ఎస్‌పి చింతా కోదండరామ్ ఉత్తర్వులు జారీచేశారు. ఇప్పటి వరకు ఆయన సిగ్మా సెక్యూరిటీ సిఐగా బాధ్యతలు నిర్వహించారు. త్వరలో యానాం సిఐగా బాధ్యతలు చేపట్టనున్నారు.



విజేతలకు బహుమతులు అందజేస్తున్న అధికారులు

ముగిసిన విద్య, వైజ్ఞానిక ప్రదర్శనలు

ప్రజాశక్తి - యానాం

స్థానిక పిఎంశ్రీ రాజీవ్ గాంధీ గవర్నమెంట్ ఇంగ్లీష్ మీడియం హైస్కూల్లో యానాం విద్యాశాఖ ఆధ్వర్యంలో ఈ నెల 2 నుంచి 4 వరకూ విద్యార్థులచే నిర్వహించిన విద్య వైజ్ఞానిక ప్రదర్శనలు గురువారంతో ముగిశాయి. ముగింపు వేడుకల్లో ఇన్‌ఛార్జి పరిపాలనాధికారి,ప్రభుత్వ ఆసుపత్రి డిడి రవిశంకర్ పాల్గొని విద్యార్థుల ఉద్దేశించి మాట్లాడారు. విజేతలకు బహుమతులు ప్రదానం చేశారు. ఆయా పాఠశాలల విద్యార్థులు ప్రదర్శించిన వివిధ అంశాలు అద్భుతంగా ఆకట్టుకున్నాయి. ఈ కార్యక్రమంలో విద్యాశాఖ అధికారి పంపన లక్ష్మణ ప్రవీణ్, ఎడిపిసి కమిడి ప్రభాకర్ రావు, జి.రత్నప్రభ, సుందరి, త్రిమూర్తులు పాల్గొన్నారు.

దోమల బెడద నివారణకు చర్యలు

ప్రజాశక్తి-గొల్లప్రోలు

పట్టణ పరిధిలో దోమలు బెడద నివారణకు ప్రత్యేక చర్యలు చేపట్టినట్లు కమిషనర్ పి శ్రీనివాసరావు తెలిపారు గురువారం పట్టణ పరిధిలో సూరంపేట ఏరియాలో దోమలను నివారించేందుకు దోమల మందు పిచికారీ, పొగ ద్వారా స్ప్రేయింగ్ చేశారు. ఈ కార్యక్రమంలో రఘు ప్రసాద్, శానిటరీ సెక్రటరీలు సిబ్బంది పాల్గొన్నారు.



సదస్సులో మాట్లాడుతున్న ఎఒ చంద్రశేఖర్

పారదర్శకంగా ధాన్యం కొనుగోళ్లు

ప్రజాశక్తి-కోటనందూరు

ధాన్యం కొనుగోలులో సిబ్బంది పారదర్శకంగా పని చేయాలని మండల వ్యవసాయ శాఖ అధికారి కె.చంద్రశేఖర్ అన్నారు. గురువారం స్థానిక తహశీల్దారు కార్యాలయంలో రైతు సేవా కేంద్రాల సిబ్బంది, రైస్ మిల్లర్లతో సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ధాన్యం గ్రేడింగ్‌లో, తూనికల్లో తీసుకోవాల్సిన జాగ్రత్తలను వివరించారు. ఆయా కేంద్రాలకు ధాన్యం తీసుకునేటప్పుడు రైతులను ఇబ్బందులకు గురి చేయొద్దని తెలిపారు. ఉదయం 8:00 గంటల నుంచి సాయంత్రం 6:00 గంటల వరకూ తప్పనిసరిగా విధుల్లో ఉండాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఇన్‌ఛార్జి తహశీల్దారు సత్యనారాయణ, రైస్ మిల్లర్ల యజమానులు, వ్యవసాయ విస్తరణాధికారులు జగ్గా అప్పారావు పాల్గొన్నారు.

నిత్యావసర సరుకుల పంపిణీ

ప్రజాశక్తి -కరప

కరపలో ఇటీవల మరణించిన కసింకోట ఆనందరావు కుటుంబానికి సుందరనీడి రాజబాబు రూ.2000 నిత్యావసర సరుకులు అందజేశారు. వారు ఆర్థిక ఇబ్బందులు ఎదుర్కొంటున్న విషయం పోలిశెట్టి తాతీలు ద్వారా తెలుసుకున్న సూరపురెడ్డి సురేష్, గురువారం అంబేద్కర్ కోనసీమ జిల్లా, ఉప్పలగుప్తం మండలం కూనవరం గ్రామానికి చెందిన సుందరనీడి రాజబాబు తన భార్య పుట్టినరోజు సందర్భంగా నిత్యావసర వస్తువులను తాతీలు ద్వారా అందజేశారు.

6న విద్యుత్ సరఫరా నిలుపుదల

ప్రజాశక్తి-తాళ్లరేవు

విద్యుత్ మరమ్మతు పనుల నిమిత్తం తాళ్లరేవు సెక్షన్, చొల్లంగి విద్యుత్ సబ్-స్టేషన్ పరిధిలో ఈ నెల 6న ఉదయం 10 గంటల నుంచి మధ్యాహ్నం 3గంటల వరకూ విద్యుత్ సరఫరా నిలుపుదల చేయనున్నట్టు కాకినాడ విద్యుత్ శాఖ ఇఇ ఎస్.ఉదయ భాస్కర్ తెలిపారు. చొల్లంగి, చొల్లంగిపేట, పటవల, కొత్తూరు రామన్నపాలెం, మట్లపాలెం, జి.వేమవరం ప్రాంతాలకు విద్యుత్ సరఫరాలో అంతరాయం కలుగుతుందని, విద్యుత్ వినియోగదారులు ఈ విషయం గమనించి సహకరించాలని కోరారు.

'కులం పేరుతో దూషించలేదు'

ప్రజాశక్తి-కాకినాడ

యు.కొత్తపల్లి మండలం యండపల్లి జెడ్‌పి పాఠశాలలో ఉపాధ్యాయులు తమను కులం పేరుతో దూషించలేదని విద్యార్థులు కలెక్టర్ షాన్‌మోహన్ సగిలికి తెలిపారు. గురువారం జిల్లా కలెక్టర్‌కు దీనిపై వారు వినతిపత్రం అందజేశారు. తమ పాఠశాల నుంచి బదిలీ చేసిన ఇంగ్లీష్, వ్యాయామ ఉపాధ్యాయులను తిరిగి తమ పాఠశాలకు పంపించాలని కోరారు. సంఘటన గురించి కలెక్టర్ విద్యార్థులను అడిగి తెలుసుకున్నారు.

కొంగోడులో పొలంబడి

ప్రజాశక్తి -కరప

కొంగోడులో ఎఒ ఐ.సత్య అధ్యక్షతన గురువారం నిర్వహరించిన పొలంబడిలో వ్యవసాయ సంచాలకులు కె.బాబూరావు ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 14 వారాల పొలంబడి కార్యక్రమం తర్వాత రైతుల సాగు పద్ధతుల్లో సానుకూల మార్పులు, పెట్టుబడులు తగ్గించి మంచి దిగుబడులు సాధించవచ్చని రైతులు నిరూపించారని తెలిపారు. పొలంబడి సూచనలు పాటించి ఉత్తమ ఫలితాలు సాధించిన ఐదుగురు రైతులను సన్మానించారు.

మూతబడిన మహిళా మార్ట్

సంఘం సభ్యుల సొమ్ములు స్వాహా..?

ప్రజాశక్తి -యు.కొత్తపల్లి

రాష్ట్రంలో మొట్టమొదటిగా ఏర్పాటు చేసిన వెలుగు మహిళా మార్ట్ ప్రస్తుతం మూతపడింది. సంఘం సభ్యులు ఆర్థికంగా రాణించాలని గత వైసిపి ప్రభుత్వంలో ఉప్పాడలో 2022 ఆగస్టులో ఘనంగా ప్రారంభించారు. మహిళలు ఆర్థిక అభివృద్ధి చెందాలనే లక్ష్యంగా డ్వాక్రా సంఘాల మహిళలు యజమానులుగా ఉండేందుకు చేయూత మార్ట్‌ను అప్పటి ప్రభుత్వం ఏర్పాటు చేసింది. మొత్తం 85 గ్రామ సంఘాల నుంచి 2400 సంఘాలు, 24000 మంది సభ్యులతో రూ.42.50 లక్షలు పెట్టుబడి పెట్టించారు. ఇది కాక రెండు మహిళా సమాఖ్యల నుంచి రూ.20 లక్షలు సొమ్ములు వేసి మొత్తం సుమారురూ.64 లక్షలతో చేయూత మార్ట్‌ను ప్రారంభించారు. కొంతకాలం గడిచిన తర్వాత మార్ట్ రూ.20 లక్షల లాభాలతో ఉందని వెల్లడించినప్పటికీ మార్ట్ దివాళా తీసిందని చెప్పారు. మార్టుకు వెచ్చించిన సొమ్ము ఎక్కడికి వెళ్ళిందంటూ సంఘం సభ్యుల్లో ఆందోళన నెలకొంది. 22 రోజుల నుంచి మార్టును మూసివేయడంతో మార్ట్‌లో ఉన్న సరుకులు పాడైపోతే ఎవరు బాధ్యులని ప్రశ్నిస్తున్నారు. ప్రభుత్వ సొమ్ము దుర్వినియోగం అవుతుంటే ప్రస్తుత అధికారులు పొంతనలేని సమాధానం చెబుతున్నారంటున్నారు. గతంలో చేయూత మార్ట్‌కు రూ.3.5 లక్షల కరెంట్ బిల్లు వస్తే కట్టలేని పరిస్థితి నెలకొంది. మార్ట్ ప్రారంభం నుంచి పూర్తిస్థాయిలో దృష్టి సారించకపోవడంతో మార్ట్ నష్టాల్లో ఉన్నట్టు పలువురు విమర్శిస్తున్నారు. మార్ట్‌లో పని చేసిన మహిళలకు జీతాలు ఇవ్వలేని పరిస్థితి నెలకొనడంతో వారు బయటికి వెళ్లిపోయారు. మార్ట్‌లో ఆడిట్ చేస్తున్నామని చెప్పినా బహిర్గతం చేయకపోవడం పలు అనుమానాలకు తావిస్తోంది. మార్ట్‌లో భారీ కుంభకోణం జరిగినట్లు ఆరోపణలు వినిపిస్తున్నాయి.



మూతపడ్డ వెలుగు చేయూత మహిళా మార్ట్

దేశానికి నష్టం జరిగిందా

ఎపిఎం మల్లేశ్వరరావు

మార్ట్ విషయంపై వివరణ కోరేందుకు ఎపిఎం మల్లేశ్వరరావును సంప్రదించగా ప్రతి ఒక్కరూ మార్ట్ గురించే మాట్లాడుతున్నారని, ఆడిట్ జరుగుతున్న కారణంగా చేయూత మార్ట్ మూసి వేశామని తెలిపారు. మహిళామార్ట్ మూసివేత వల్ల దేశానికి గానీ, ఊరికి కానీ నష్టం ఏమైనా జరిగిందా? అని పొంతన లేని సమాధానం చెప్పడం విడ్డూరం.

బాలల చట్టాలపై అవగాహన

ప్రజాశక్తి-కాకినాడ

బాల్య వివాహ ముక్త్ భారత్ 100 రోజుల కాంపెయిన్‌లో భాగంగా చైల్డ్ హెల్ప్‌లైన్ 1098 ఆధ్వర్యంలో స్థానిక జగన్నాథపురంలోని సత్యదేవ ప్రభుత్వ మహిళా డిగ్రీ కళాశాలలో పోక్సో చట్టంపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ప్రిన్సిపల్ డాక్టర్ వి.అనంత లక్ష్మి అధ్యక్షతన నిర్వహించిన ఈ కార్యక్రమంలో చైల్డ్ హెల్ప్ లైన్ 1098 జిల్లా ప్రాజెక్ట్ కో ఆర్డినేటర్ బి.శ్రీనివాసరావు పాల్గొని మాట్లాడారు. బాల్య వివాహ ముక్త భారత్ కాంపెయిన్‌లో భాగంగా 27 నవంబర్ 2025 నుంచి 16 మార్చి 2026 వరకూ అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తున్నామన్నారు. దేశంలో బాల్య వివాహాలకు వ్యతిరేకంగా ఈ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్టు తెలిపారు. బాల్య వివాహాల నుంచి బాలలను కాపాడాల్సిన బాధ్యత ప్రతి పౌరుడుపై ఉందన్నారు. బాలలను స్నేహ పూరిత వాతావరణంలో తీర్చి దిద్దడంలో ప్రతి ఒక్కరూ భాగస్వామ్యం కావాలన్నారు. బాల్య వివాహాలు బాలికల విద్య, రక్షణ, ఆరోగ్యం, అభివృద్ధికి ఆటంకమే కాక వారి కలలను సాకారం చేసుకునే అవకాశాలను దూరం చేస్తోందన్నారు. బాల్య వివాహాలకు వ్యతిరేకంగా సాధ్యమైన ప్రతి ప్రయత్నం చేయాలన్నారు. బాల్య వివాహం చేయడానికి చేసిన ఏ ప్రయత్నాన్నైనా పంచాయతీ, ప్రభుత్వ అధికారులకు తెలియపరచాలని లేదా చైల్డ్ హెల్ప్‌లైన్ 1098కి ఫోన్ చేసి సమాచారం ఇవ్వాలన్నారు. ఎవరైనా బాల్య వివాహాలను ప్రోత్సహించినా, సహకరించినా చట్ట ప్రకారం చర్యలు తీసుకుంటామని తెలిపారు. బాలల విద్య, భద్రత కోసం ప్రతి పౌరుడు గళాన్ని వినిపించాలని, బాల్య వివాహ ఆంధ్రప్రదేశ్ సాకారానికి మద్దతు ఇవ్వాలన్నారు. ఈ కార్యక్రమంలో చైల్డ్ హెల్ప్ లైన్ వర్కర్ ఎన్‌వి.లక్ష్మి, డాక్టర్ కె.ఝాన్సీ లక్ష్మి, సభ్యులు పి.లీనా, ఎ.స్వాతి, బిఎన్.ప్రత్యూష, ఎం.సుబ్బలక్ష్మి పాల్గొన్నారు.



విద్యార్థులకు అవగాహన కల్పిస్తున్న కో ఆర్డినేటర్ శ్రీనివాసరావు

సిఆర్‌ఎంటిలను విద్యాశాఖలో విలీనం చేయాలి

ప్రజాశక్తి -తాళ్లరేవు, సామర్లకోట

విద్యా శాఖలో పని చేస్తున్న క్లస్టర్ రిజర్వుడు మొబైల్ టీచర్స్ (సిఆర్‌ఎంటి)ల సమస్యలు పరిష్కరించాలని ఎపి సిఆర్‌ఎం టీచర్స్ ఫోరం ఆధ్వర్యంలో గురువారం తాళ్లరేవులో తహశీల్దారు పి.త్రినాథరావుకు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా యూనియన్ జిల్లా అధ్యక్షుడు తరాల మీరాసాహెబ్ విలేకరులతో మాట్లాడారు. కొత్తగా తీసుకొచ్చిన క్లస్టర్ ఎ, బి విధానాన్ని రద్దు చేసి పాత స్కూల్ కాంప్లెక్స్ విధానాన్ని కొనసాగించాలని కోరారు. స్థానికత ఆధారంగా నియామకాలు జరగడం వల్ల స్థానిక మండలంలోనే పని చేసేలా ఉండాలన్నారు. సిఆర్‌ఎం టీచర్లను విద్యాశాఖలో విలీనంతో పాటు రెగ్యులర్ చేసి ప్రభుత్వ రాయితీలన్నీ కల్పించాలని కోరారు. ఈ డిమాండ్ల సాధన కోసం యూనియన్ రాష్ట్రవ్యాప్తంగా కార్యక్రమాలకు పిలుపునిచ్చిందని ఆయన తెలిపారు. మండల కేంద్రాల్లో వినతి పత్రాలు ఇవ్వడం, ఈ నెల 8న జిల్లా కేంద్రాల వద్ద ఆత్మగౌరవ దీక్ష, 22న విజయవాడలో ఆత్మగౌరవ దీక్ష చేస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో సిఆర్‌ఎంటిలు కాశి శ్రీనివాస్, మత్స రాజేంద్రప్రసాద్, రేవు మానస, జల్లి ప్రశాంతి, యుటిఎఫ్ నాయకులు ఎస్.మురళీకృష్ణ, ఎస్‌వి.రమణ కుమార్, ఎస్‌టియు అధ్యక్షుడు వి.వెంకటేశ్వర్లు మద్దతు పలికారు.

సామర్లకోట సిఆర్‌ఎంటిలకు వేతనాలు పెంచి, ఉద్యోగ భద్రత కల్పించాలి డిప్యూటీ తహశీల్దారు కె.పద్మజ, ఎంఇఒలు వై.శివరామకృష్ణయ్య, పి.పుల్లయ్య తదితరులకు గురువారం సాయంత్రం వినతిపత్రం అందించారు. ఎ.వీర్రాజు, ఎం.శ్రీనివాసరావు, కె.ఉమామహేశ్వరరావు, తనూజ, నాగమణి పాల్గొన్నారు.



డిటి పద్మజకు వినతి పత్రం అందజేస్తున్న సిఎంఆర్‌టిలు

ట్రస్ట్ ద్వారా విద్యార్థినికి ఆర్థిక సాయం

ప్రజాశక్తి-పిఠాపురం

పట్టణంలో స్థానిక బొజ్జా వారి తోటలో వున్న లిటిల్ స్టార్ రూరల్ డెవలప్‌మెంట్ ట్రస్ట్ కార్యాలయంలో గురువారం విద్యార్థినికి రూ.20 వేల చెక్కును అందజేశారు. ఈ సందర్భంగా ట్రస్ట్ వ్యవస్థాపకులు కరుణ్ రాజు (కామేశ్వరరావు) మాట్లాడుతూ స్థానిక మోహన్ నగర్‌కు చెందిన ఎం.కల్యాణి చదువుకునేందుకు ఆర్థికంగా ఇబ్బంది పడుతోందని తమ ట్రస్ట్ దృష్టికి వచ్చిందన్నారు. దీంతో తమకు తెలిసిన ఎన్.రమ్య, చంటి, దంపతుల దృష్టికి ఈ విషయాన్ని తీసుకువెళ్ళడంతో వారు స్పందించి విద్యార్థిని చదువుకు ఇబ్బంది కలాగకూడదని తమ వంతు రూ.15 వేల ఆర్థిక సాయం అందించినట్టు తెలిపారు. మరొక దాత రూ.5000 ట్రస్ట్‌కు అందజేశారన్నారు. మొత్తం రూన.20 వేల చెక్కును విద్యార్థినికి అందజేశామన్నారు. ట్రస్ట్ తరపున ఇప్పటికే పలు సేవా కార్యక్రమాలు చేస్తున్నామని, భవిష్యత్తులో మరింత మందికి సహకారాలు అందించేందుకు సిద్ధంగా ఉన్నామన్నారు. ఇటువంటి విద్యార్థులకు సాయం చేయదలచిన వారు తమ ట్రస్టుని సంప్రదించవచ్చన్నారు. ఈ కార్యక్రమంలో ట్రస్టు గౌరవాధ్యక్షురాలు టి.రాధ, ట్రస్టు సభ్యులు టి.కృపారాణి, ట్రస్టు డైరెక్టర్ టి.బ్యూలాగ్రేస్, సుబ్రహ్మణ్యం పాల్గొన్నారు.



విద్యార్థినికి చెకు అందజేస్తున్న ట్రస్ట్ నిర్వాహకులు

కాలువల్లోకి వ్యర్థాలను నిలిపివేయాలి

ప్రజాశక్తి- యు.కొత్తపల్లి

చేపల చెరువుల నుండి కాలవల్లోకి తోడుతున్న వ్యర్థాలను తక్షణమే నిలిపివేయాలని తూర్పు డెల్టా చైర్మన్ మురాల శెట్టి సునీల్ కుమార్ డిమాండ్ చేశారు. గురువారం డిఎఫ్ఒ పి.కృష్ణారావుకు సమస్యను వివరించి ఫిర్యాదు లేఖను అందజేసినట్టు తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కాకినాడ జిల్లాలో చేపలు, రొయ్యల చెరువులు సాగు చేసేవారు మోటార్లను ఉపయోగించి పంట కాలువల్లో స్లడ్జి తోడటం, మురికి నీటిని పంపింగ్ చేయడం వల్ల కాలువల్లో బురద ఏర్పడి నీటి సామర్థ్యం తగ్గిపోతోందన్నారు. వరదల సమయంలో, వర్షాకాలంలో వ్యవసాయ భూములు ముంపునకు గురవుతున్నాయని, జిల్లాలో పలు గ్రామాల పర్యటనలో రైతులు ఇచ్చిన ఫిర్యాదుల మేరకు స్పందించి తక్షణమే అనధికారిక పంపింగ్ ఆపేందుకు చర్యలు తీసుకోవాలని అధికారులను కోరినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో పెద్దాడ, కాజులూరు, కరప డిసిలు సనా శ్రీనివాస్, లకాని కృష్ణ చైతన్య, పున్నమంతుల సత్యనారాయణ, డ్రైన్స్ జెఇ వీరబాబు, జెఇ సుబ్రహ్మణ్యం పాల్గొన్నారు.



సమస్యలు వివరిస్తున్న కాలనీ వాసులు

కాలనీలో సమస్యలు పరిష్కరించరూ..

ప్రజాశక్తి-ఏలేశ్వరం

తమ కాలనీలో నెలకొన్న సమస్యలను పరిష్కరించాలని ఏలేశ్వరం శివారు పైప్ లైన్ జగన్ కాలనీవాసులు మున్సిపల్ అధికారులకు తమ గోడు వినిపించారు. ఈ సందర్భంగా కూటమి నాయకుడు రెడ్డి రాజు మాట్లాడుతూ గత ప్రభుత్వ హయాంలో తమకు ఇళ్ల స్థలాలు ఇచ్చారని, రోడ్డు లేకపోవడంతో ఊరికి మూడు కిలోమీటర్ల అవతల నివసిస్తున్నామని ఆవేదన వ్యక్తం చేశారు. తమ కాలనీ చుట్టుపక్కల ఉన్న పొలాలకు రైతులు కంచెలు వేస్తుండడం వల్ల కాలనీ నుంచి బయటికి రావడానికి రహదారులు లేవని వాపోయారు. రోడ్డు లేకపోవడంతో బురదలో పొలాల మధ్య విష కీటకాల మధ్య నడిచి రావాల్సి వస్తోందని, ఇంటి అద్దెలు కట్టలేక ఇచ్చిన ఒక సెంటు భూమిలో అప్పులు చేసి ఇల్లు నిర్మించుకున్నామని ఇప్పుడు ఆ ఇల్లు నివాసయోగ్యంగా లేకపోవడంతో పిల్లాపాపలతో పలు ఇబ్బందులకు గురవుతున్నామని తెలిపారు. కనీసం మా కాలనీకే ఆటో కూడా వచ్చే పరిస్థితి లేకపోవడంతో అనారోగ్యం పాలైతే భుజాల మీద మూసుకు రావాల్సి వస్తుందని వారు తెలిపారు. ఈ కార్యక్రమంలో గొల్లపల్లి సూర్య కళ, కోణాల నూకమణి, కె.సత్య, అప్పలరాజు, శీరం సూర్యకుమారి, రాజ్యలక్ష్మి, మహిళలు ఉన్నారు.